సాక్షి కృష్ణాజిల్లా

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



దుర్గగుడికి రూ.1.08 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్న దానానికి కొల్లి రాధాకృష్ణమూర్తి పేరిట ఎనికేపాడు గ్రామానికి చెందిన ఎస్.శ్రీదేవి కుటుంబం శని వారం రూ.1.08 లక్షల విరాళం సమర్పించింది.



బాధ్యతల స్వీకరణ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా పశుసం వర్ధక శాఖ అధికారిగా ఎస్.చిననరసింహులు శని వారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలె క్టర్ బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు.



ఎడ్ల పోటీల విజేత కృష్ణా

ప్రత్తిపాడు: గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో కృష్ణా ఎడ్లు సత్తా చాటాయి. బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన గిత్తలు విజేతగా నిలిచాయి.

న్యూస్‌రీల్

ఫీవర్ సర్వే సక్రమంగా నిర్వహించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో ఫీవర్ సర్వేను సక్ర మంగా నిర్వహించాలని, వైద్య సిబ్బంది ఇంటిం టికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించా లని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. ఆమె శనివారం నగరంలోని రాజీవ్‌నగర్, ప్రకాష్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఇంటిం టికీ జరుగుతున్న ఫీవర్ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సల హాలు ఇచ్చారు. వరద ముంపునకు గురైన రాజీ వ్‌నగర్, ప్రకాష్‌నగర్ ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలు పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచి స్తూ, వాటిని ఆమె పరిశీలించారు. ఈ కార్య క్రమంలో ఆయా వైద్య కేంద్రాల వైద్యులు, మలే రియా సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తు లకు దేవస్థానం కల్పిస్తున్న ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు శనివారం పరిశీలించారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్ని ధిలో అక్టోబర్ మూడు నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న పనులు, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను సీపీ తన బృందం తో శనివారం పరిశీలించారు. ఘాట్‌రోడ్డు, ఓం టర్నింగ్, క్యూలైన్లు, అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించే మార్గంతో పాటు భక్తులకు బయ టకు వచ్చే మార్గాలను తనిఖీ చేశారు. ఆర్జిత సేవలు, ఉభయదాతల కోసం ఏర్పాటు చేసే క్యూలైన్లను పరిశీలించారు. గతంలో ఉభయదా తలకు కలిగిన అసౌకర్యం గురించి పోలీసు అధి కారులు సీపీ దృష్టికి తీసుకువెళ్లగా, ఈ దఫా అటువంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనం తరం సీపీ రాజశేఖర్‌బాబు అమ్మవారిని దర్శిం చుకున్నారు. సీపీ వెంట డీసీపీ గౌతమిశాలి, దుర్గగుడి ఈఈ కోటేశ్వరరావు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ డివిజన్ ఏసీపీగా బంగారురాజు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ సౌత్ పోలీస్ డివిజన్ ఏసీపీగా యు.బంగారు రాజు శనివారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఏసీబీ నుంచి ఎన్టీఆర్ కమిషనరేట్‌కు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసిమొక్క అందజేశారు.

• మంచు శివలింగం



కోడూరు తూర్పు వైపునకు చెందిన యువత ఏర్పాటు చేసిన మంచు శివలింగం విశేషంగా ఆకట్టుకుంది. గ్రామంలో గణ నాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. శనివారం లంబోదరుడి నిమజ్జనం సందర్భంగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఐస్‌తో శివలింగాన్ని తీర్చిదిద్ది, ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. మంచు కరగ కుండా ఏర్పాట్లు చేశారు. ఊరేగింపు అనంతరం గణనాథుడితో పాటు మంచు శివలింగాన్ని కూడా కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

– కోడూరు

బుడమేరు వరదతో బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలో నీట మునిగి పైరు కుళ్లిపోయిన వరిచేలు



నష్ట పరిహాసం

- వరదలతో జిల్లాలో 48,641 హెక్టార్లలో పొలాల మునక
- పది రోజులు నీటిలో ఉండటంతో కుళ్లిన పంటలు
- తొలుత రూ.493.06 కోట్ల నష్టమని నిర్ధారించిన అధికారులు
- ఇప్పుడు ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల పేరుతో అన్నింటిలోనూ కోత
- 21,661 హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే పంట దెబ్బతిన్నట్లు ప్రకటన
- రూ.53.72 కోట్లు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు ఉత్తర్వులు
- పంటలు నష్టపోయిన రైతులతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం

సాక్షి, మచిలీపట్నం: కృష్ణా, బుడమేరు వరదలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులతో రాష్ట్ర ప్రభుత్వం పరిహాసం ఆడుతోంది. ఎన్నడూ లేని విధంగా అధిక వర్షాలు కురవడంతో కృష్ణమ్మ ఉగ్ర రూపంతో వచ్చింది. బుడమేరు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో వాటి పరీవాహక ప్రాంతాల్లోని వేల హెక్టార్లలో పంటపొలాలు నీట మునిగాయి. సుమారు పది రోజులకు పైగా నీటిలోనే ఉండి పోవడంతో పైర్లు కుళ్లిపోయాయి. వేల మంది రైతు లకు కన్నీళ్లే మిగిలాయి. తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం హద్దులు విధించింది. ముంపునకు గురైన పొలాల విస్తీర్ణాన్ని కుదించింది. నిబంధనల పేరుతో బాధితుల జాబితాలో కోతలు పెట్టింది. ఇన్‌పుట్ సబ్సిడీని భారీగా తగ్గించింది.

కొండంత నష్టం

వరద కారణంగా జిల్లాలో పెద్ద ఎత్తున పంట నష్టం జరిగింది. బాధిత రైతులను పెద్ద మనసుతో ఆదుకోవాల్సిన ప్రభుత్వం భారాన్ని తగ్గించుకునే పనిలో ఉంది. కొండంత నష్టం జరిగితే గోరంత సాయాన్ని ఖరారు చేసింది. గత వారంలో కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. బాధితులతో మాట్లాడి, వారి గోడు రాసుకుంది. అప్పటికే జిల్లా అధికారులు పంట ముంపు, జరిగిన నష్టం వివరాల నివేదికలను వారికి అందించారు. ఈ లెక్కన జిల్లాలో మొత్తం 48,641 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయి. 44,521 హెక్టార్లలో వరి, వేరుశనగ, మినుములు, చెరుకు, పత్తి తదితర పంటలు, 4,070 హెక్టార్ల ఉద్యాన, 50 హెక్టార్ల పట్టు పంటలు దెబ్బతిన్నాయి. వరద తగ్గాక పంట నష్టం నమోదుపై అధికారులు దృష్టి పెట్టారు. రెవెన్యూ, వ్యవసాయం, ఉద్యాన శాఖల అధికారులు పొలాలను పరిశీలించి నష్టం వివరాలు నమోదు చేశారు. మొత్తం రూ.493.06 కోట్ల నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా చేశారు. 44,521 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు రూ.385.24 కోట్లు, 4,070 హెక్టార్ల ఉద్యాన పంటలకు రూ.107.82 కోట్ల అంచనా వేసి కేంద్ర బృందానికి నివేదిక ఇచ్చారు.

గోరంత ప్రకటన

కృష్ణమ్మ, బుడమేరు కన్నెర్రజేయడంతో రూ.493.06 కోట్ల నష్టం జరిగిందని అధికారులు అంచనా వేసి నివేదికలు పంపగా, ప్రభుత్వం మాత్రం భారీగా కోత విధించింది. కొండంత నష్టం జరిగితే గోరంత ఇచ్చేందుకు సిద్ధమైంది. ఎస్‌డీఆర్ ఎఫ్ నిబంధన ప్రకారం అంటూ వ్యవసాయ శాఖ డైరెక్టర్ జారీ చేసింది. ఈ నివేదిక ప్రకారం కృష్ణా జిల్లాలో 21,661.02 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని, 34,389 మంది రైతులకు రూ.53,72,74,000 ఇన్‌పుట్ సబ్సిడీ కావాలని కోరింది. రూ.493.06 కోట్ల నష్టం జరిగితే రూ.53.72 కోట్లకు కుదించింది. ఖరీఫ్‌లో సేద్యం, నారు, నాట్లు, కూలీలు, ఎరువులు, మందులు ఇలా.. అనేక విధాలా సస్య రక్షణ కోసం ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు.

నిబంధనల పేరుతో కోత

బాధిత రైతులను ఉదారంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం అంటూ కోతలు విధించింది. బాధితుల్లో 95 శాతానికి పైగా ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయినా నమోదులో ఆన్‌లైన్, యాప్ ఎంట్రీ, ఎస్‌డీ ఆర్‌ఎఫ్ నిబంధనల పేరుతో కుదించే చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

రైతులకు న్యాయం చేయాలి



ఇటీవల వచ్చిన వరదలకు జిల్లాలో వేలాది ఎకరాలు నీటమునిగాయి. నాగాయలంక, కోడూరు మండలాల్లో చాలా మంది రైతులు నష్టపోయారు. నాట్లు వేసిన పొలాలు మునిగి 10 రోజులకు పైగా నీటిలోనే ఉండటంతో పైరు కుళ్లిపోయింది. నష్టం అంచనాలు వేసిన అధికారులు చివరి పొలాల వరకూ వెళ్లలేదు. దీనివల్ల నష్టపోయిన రైతులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. రాజకీయాలు చూడకుండా ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల పరిహారం అందించాలి.

– బీసాబత్తిన ప్రసాద్, మాజీ డీసీ చైర్మన్, నాగాయలంక

15 ఎకరాల్లో వరి దెబ్బతింది



15 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వరి పంట వేశాను. ఎకరానికి రూ.20 వేలకు పైగా పెట్టుబడిగా ఖర్చు చేశా. కౌలు సొమ్మును పొలం యజమానులకు ముందుగానే చెల్లించా. బుడమేరు వరదలో వరి పంట అంతా ముంపునకు గురయింది. పది రోజుల పాటు నీటిలో ఉండడంతో పైరు మొత్తం కుళ్లిపోయింది. అధికారులు వచ్చి నష్టం వివరాలు రాసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం నష్టంలో కోత పెడితే పరిహారం వస్తుందో రాదో.. వస్తే ఎంత వస్తుందో అని ఆందోళన ఉంది.

– గోగులమూడి రాజు, ఉంగుటూరు

గృహనిర్మాణ పనులను వేగవంతం చేయండి



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని అన్ని మండలాల్లో లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించి గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డి.కె. బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం సాయంత్రం క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పీఎం ఆవాస్ యోజన ద్వారా మంజూరైన పక్కా ఇళ్ల నిర్మాణాన్ని వచ్చే మార్చి లోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో 'మన ఇల్లు – మన గౌరవం' పేరుతో మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓల సమన్వయంతో ఈ నెల 22వ తేదీన గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ నెల 26వ తేదీన సచివాలయ ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. గృహనిర్మాణం కోసం అవసరమైన కూలీలు, మేస్త్రీలు, సిమెంటు, ఇసుక, స్టీలు వంటి సామగ్రిని అనుసంధానం చేసుకుంటూ దశలవారీగా పురోగతి సాధించాలన్నారు. ఈ నెల 25న గృహనిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. స్వర్ణాంధ్ర – 2047 పోస్టర్లను ఇంటింటికీ పంపిణీ చేయాలని సూచించారు. ప్రణాళికాశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. డ్వామా పీడీ సూర్యనారాయణ, సీపీఓ గణేష్‌కృష్ణ పాల్గొన్నారు.

అందాల దీవి.. అంతరిస్తున్న దీవి

- అలల తాకిడితో కనుమరుగవుతున్న చినగొల్లపాలెం
- క్రమంగా సాగర గర్భంలో కలిసిపోతున్న గ్రామం
- ఇప్పటికైనా పట్టించుకుంటేనే దీవి మనుగడ సాధ్యం



కోత వల్ల సముద్ర గర్భంలో కలసిపోతున్న కొబ్బరి చెట్లు

కృత్తివెన్ను: మూడు వైపులా ఆక్రమించిన ఉప్పుటేరు.. మరో వైపు అలలతో సందడి చేసే బంగాళా ఖాతం సరిహద్దులుగా ఉన్న సుందర దీవి చినగొల్లపాలెం. నీటిలో తేలుతున్నట్లుగా ప్రకృతి అందాలతో ఆప్యాయంగా పలకరించే ఈ అందాల దీవి కష్టాలను పట్టించుకునే వారే కరువయ్యారు. కనువిందు చేయాల్సిన సముద్రపు అలలు, ఉగ్ర రూపంతో విరుచుకుపడి దీవిని కబళిస్తున్నాయి. ఇప్పటికే వందల ఎకరాలను కడలిలో కలిపేశాయి. తమ కళ్లముందే గ్రామాన్ని సముద్రం కబళిస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో దీవి వాసులున్నారు. ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడటం తప్ప వారు ఏమీ చేయలేని పరిస్థితి. పాలకులు, అధికారులు స్పందించి తమ గ్రామాన్ని రక్షించాలని వేడుకుంటున్నారు.

ప్రకృతి ప్రసాదం

కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దున బంగాళాఖాతం, ఉప్పుటేరు సరిహద్దుగా కృత్తివెన్ను మండలంలో చినగొల్లపాలెం గ్రామం ఉంది. చుట్టూ నీటితో ఉండటం వల్ల దీన్ని దీవిగా పిలుస్తారు. ఈ దీవి పది కిలో మీటర్ల పొడవున దాదాపు పదివేల పైచిలుకు విస్తీర్ణంలో ఉంది. నాలుగువేల ఎకరాలు పైచిలుకు సాగు భూమి ఉంది. ప్రధానంగా సరుగుడు, కొబ్బరి, పాక్షికంగా మామిడి, సపోట సాగుచేస్తారు. సాగునీటి సౌకర్యం లేకపోవడంతో వర్షాధారంగా కొద్ది విస్తీర్ణంలో వరి, వేరుశనగ పండిస్తారు. పదివేల జనాభా కలిగిన ఈ దీవి ప్రస్తుతం ప్రమాదం అంచులో ఉంది. బంగాళాఖాతం దీవివైపు వేగంగా దూసుకురావడమే దీనికి ప్రధాన కారణం.

ప్రధాన సమస్య ఇదీ

గతంలో దీవికి తూర్పు వైపున పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దుగా పాతకాలువ పేరుతో ఉప్పుటేరు పాయ ఉండేది. దీని ద్వారా ఎగువనున్న భీమవరం కాలువ (యనమదుర్రు డ్రెయిన్), మొగల్తూరు కాలువ, కొల్లేరు ముంపునీరు సముద్రంలో కలిసేది. వరద నీటి తాకిడి ఎక్కువగా ఉండటంతో దీవికి ముప్పుగా భావించి 1970వ ప్రాంతంలో దీవికి పశ్చిమాన పడతడిక పంచాయితీ సరిహద్దుగా మరో కాలువను తవ్వారు. దీన్ని ఈప్రాంత వాసులు కొత్తకాలువగా పిలుస్తారు. కొల్లేరు నుంచి వచ్చే ముంపు నీరు ఈ కాలువ ద్వారానే బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ కాలువ తవ్వకంతో అప్పటి వరకు ద్వీపకల్పంగా ఉన్న ఈ ప్రాంతం మానవ కల్పిత ద్వీపంగా మారిపోయింది. పాతకాలువ, కొత్తకాలువల ముఖద్వారాలు పూడుకుపోవడంతో సముద్రం నీరు మైదాన ప్రాంతంలోకి చొచ్చుకొస్తోంది. దీని తీవ్రత ఎంతలా ఉందంటే ఇప్పటికే దాదాపు ఆరు వందల ఎకరాల పంట భూములు సముద్రంలో కలిసిపోయాయి. దీన్ని నివారించకపోతే అత్యంత త్వరలో దీవి సముద్రంలో కలిసిపోయే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వాలు, పాలకులు పరిశీలనలు చేసి ప్రతిపాదనలు పంపినా కేవలం అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని కాలువ ముఖద్వారాలు పూడిక తీత చేపట్టి సముద్రం వెంబడి రాతి కట్టడాన్ని నిర్మించి దీవిని కాపాడాలని దీవి వాసులు కోరుతున్నారు.



చినగొల్లపాలెం దీవి

దీవిని కాపాడాలి



సముద్రపు కోత రోజురోజుకు ఎక్కువైపోతోంది. దీని వల్ల వందలాది ఎకరాల భూమి కోతకు గురికావడమే కాకుండా రానురాను దీవి మనుగడ కూడా ప్రమాదంలో పడుతోంది. దీవి కోత నివారణకు ఎన్నో సార్లు అధికారులు, నాయకులు వచ్చి పరిశీలించి వెళ్లారు కానీ పనులు జరగలేదు. సముద్ర ముఖద్వారం పూడిక తీసి రాతికట్టడం నిర్మించి దీవిని కాపాడాలి.

– కొక్కిలిగడ్డ బాపూజీ, మాజీ సర్పంచ్, చినగొల్లపాలెం

ఏడాదిన్నరలో బందరు పోర్టుకు షిప్‌లు

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: రానున్న ఏడాదిన్నరలో బందరు పోర్టు పనులు పూర్తి చేసి షిప్‌ల రాకపోకలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మచిలీపట్నంలోని 24, 50 డివిజన్లలో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడారు. బీపీసీఎల్ కంపెనీ ద్వారా రూ.60 వేల కోట్ల పెట్టుబడులు మచిలీపట్నానికి తీసుకొచ్చేందుకు ఎంపీ బాలశౌరితో కలిసి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ పెట్టుబడులు వస్తే బందరు ముఖచిత్రం మారిపోతుందన్నారు. 50వ డివిజన్‌లోని సుందరయ్యనగర్ రోడ్డును విజయవాడ జాతీయ రహదారికి కలిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అరిసేపల్లి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తాము డబ్బులు చెల్లించినప్పటికీ జీ+3 గృహాలు రాలేదని కరగ్రహారం లేఅవుట్‌లో బీ–బ్లాక్‌లో స్థలం వచ్చినా అది కోర్టులో ఉందని చెబుతున్నారని 24వ డివిజన్‌కు చెందిన మహిళలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందిస్తూ ఈ సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. గోసంఘంలో ఈ నెలాఖరు నాటికి 223 మందికి జీ+3 గృహాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాలను ఇచ్చి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.4 లక్షలతో గృహనిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగులు వేస్తున్నారని, దీపావళి నాటికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్.బాపిరాజు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎం.వి.బాబాప్రసాద్, జనసేన నాయకుడు బండి రామకృష్ణ, టీడీపీ నగర అధ్యక్షుడు ఇలియాస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

కాలువల మరమ్మతులు వేగవంతం చేయండి

చిలకలపూడి(మచిలీపట్నం): వరదలకు దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులను వేగవంతం చేయాలని కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జలవనరులశాఖ అధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. వరదలకు కాలువలు, కరకట్టలు 235 చోట్ల దెబ్బతిన్నాయని, 70 చోట్ల మరమ్మతులు పూర్తి చేశామని జలవనరులశాఖ ఎస్ఈ రంగయ్య కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన పనులకు అనుమతులు రాగానే పూర్తి చేస్తామన్నారు. ఏలూరు రైవస్ కాలువలకు సంబంధించిన ఈఈ కె.బాబు మాట్లాడుతూ.. జిల్లాలో కృష్ణా తూర్పు డివిజన్‌లో మొత్తం 42 చోట్ల కాలువలు దెబ్బతిన్నాయని, 20 చోట్ల మరమ్మతులు పూర్తి చేశామని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గంలో ఏలూరు కాలువ 12 చోట్ల దెబ్బతిందని, 80 శాతం మరమ్మతులు పూర్తయ్యాయని వివరించారు. జక్కులనెక్కలంలో దెబ్బతిన్న కాలువకు రెండు వేల క్యూబిక్ మీటర్ల మట్టి అవసరమని, 200 టిప్పర్లతో పనులు చేపట్టాల్సి ఉందని ఈఈ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. డ్రెయినేజీ ఈఈ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

29న కృష్ణాజిల్లా రచయితల సంఘం మహా సభలు

విజయవాడ కల్చరల్: కృష్ణాజిల్లా రచయితల సంఘం మహాసభలు ఈ నెల 29వ తేదీ ఆదివారం అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, కవి నగ్నముని ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పర్యావరణ సదస్సు, సాహితీ మూర్తుల పురస్కారాలు, కవితా గోష్ఠి జరుగుతుందని తెలిపారు.

వివిధ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

చిలకలపూడి(మచిలీపట్నం): మహిళాభివృద్ధి, శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ వాత్సల్య, మేనేజర్/కో–ఆర్డినేటర్, డాక్టర్, ఆయా, చౌకీదార్, కుక్, హెల్పర్, నైట్ వాచ్‌మెన్, యోగా ఇన్‌స్ట్రక్టర్, పారా మెడికల్ పర్సన్, సెక్యూరిటీ గార్డు, బ్లాక్ కో–ఆర్డినేటర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో ఒక సంవత్సరానికి భర్తీ చేస్తామన్నారు. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోగా విజయవాడ కానూరులో ఎస్ఎస్ఆర్ అకాడమీ, ఉమా శంకర్ నగర్‌లో ఉన్న జిల్లా మహిళ సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయానికి పంపాలన్నారు. గడువు తేదీ తరువాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని చెప్పారు. కృష్ణాజిల్లాకు సంబంధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 89776 75206, 99515 13727 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మునేరులో గల్లంతైన వ్యక్తి మృతి



కంచికచర్ల: కూలి పనులు లేక తన స్నేహితునితో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ బోన గిరి రాజు కథనం మేరకు మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన జక్కుల వెంకటేశ్వరరావు(43) తన స్నేహితుడు నాగేశ్వరరావు కలిసి నిర్మాణ రంగ పనులు చేస్తుంటారు. శుక్రవారం తాపీ పనులు లేకపోవటంతో ఇద్దరు సరదాగా గ్రామ సమీపంలోని మున్నేరులో చేపలు పట్టేందుకు వెళ్లారు. అయితే మున్నేరులో లోతు ఎక్కువగా ఉండటంతో నాగేశ్వరరావు ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. వెంకటేశ్వరరావుకు ఈత రాకపోవటంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానిక జాలర్ల చేత గాలింపు చర్యలు చేపట్టారు. అయితే రాత్రి చీకటిగా ఉండటంతో గాలించటం ఆపివేశారు. శనివారం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా మునేరులో ఓ ప్రదేశంలో నిర్జీవంగా కనిపించాడు. గమనించిన జాలర్లు ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని చూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైళ్లలో చోరీలు చేసే నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైళ్లు, రైల్వే స్టేషన్లలో చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేసి రూ.1.77 లక్షల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పలు రైళ్లు, రైల్వే స్టేషన్‌లోని చైన్ స్నాచింగ్‌లు, బ్యాగుల చోరీలపై విజయవాడ జీఆర్పీ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టామన్నారు. స్టేషన్‌లోని సీసీ కెమేరాల ఆధారంగా నేరాలకు పాల్పడింది ఉత్తరప్రదేశ్‌కు చెందిన పాత నేరస్తుడు సూర్యపాల్ సింగ్‌గా గుర్తించి అతనిపై నిఘా పెట్టామని చెప్పారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 10 గంటల సమయంలో విజయవాడ రైల్వే స్టేషన్‌లో నిందితుడు సంచరిస్తున్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో నమోదైన మూడు కేసుల్లో చోరీలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడన్నారు. అతని వద్ద నుంచి ఒక కేసులో రూ.1,02,000 విలువ చేసే 34 గ్రాముల బంగారు నానుతాడు, రెండో కేసులో రూ.10 వేలు విలువ చేసే ఒక మొబైల్‌ఫోన్, రూ.70 వేలు నగదు, మరో కేసులో రూ. 5వేలు నగదు మొత్తంగా రూ. 1,77,000 విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

24 నుంచి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ రాష్ట్ర టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను కానూరు 100 అడుగుల రోడ్డులోని అనుమోలు ప్రభాకర్ మైదానంలో నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో 12 జిల్లాల జట్లు పాల్గొంటాయని చెప్పారు. 12 మంది పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని, పోటీల అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్‌లు అందజేస్తామన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న దొంగల అరెస్ట్

పటమట(విజయవాడతూర్పు): ఇళ్ల ముందు, కార్యాలయాల వద్ద, రోడ్ల వెంబడి పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసే దొంగలను పటమట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు సెంట్రల్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్‌కిషోర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. చెడు వ్యసనాలకు బానిసలైన పెనమలూరు మండలం యనమలకుదురు సంజీవయ్య నగర్‌కు చెందిన దమ్ము కిరణ్‌జోజి అలియాస్ ఘని గణేష్, కానూరు సనత్‌నగర్ సుబ్బులమ్మ పుట్ట ప్రాంతానికి చెందిన మానికుంట ముక్కలు కలిసి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, పటమట పీఎస్ పరిధిలో 9 ద్విచక్ర వాహనాలు చోరీ చేశారన్నారు. వాటి విలువ రూ.6 లక్షలు ఉంటుందన్నారు. బైక్ చోరీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు పటమట, విజయవాడ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. దొంగిలించిన బైక్‌లను విక్రయించే ప్రయత్నంలో నిందితులను ఆటోనగర్‌లో శనివారం అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి 10 వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో క్రైమ్ ఏఎస్ఐ వీజీవీడీ ప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రైల్వే టెన్నిస్ టోర్నమెంట్‌లో టైటిల్ కైవసం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా రైల్వే టెన్నిస్ టోర్నమెంట్ వెటరన్స్ విభాగంలో గుంటూరు అమరావతిలోని ఆర్‌సీటీ అదనపు రిజిస్ట్రార్ కె.రాజేంద్రప్రసాద్, విజయవాడలోని ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ కె.సంపత్‌కుమార్‌లు టైటిల్ కైవసం చేసుకున్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు చెన్నైలోని ఐసీఎఫ్ కోచ్ ఫ్యాక్టరీలో జరిగిన 70వ ఆల్ ఇండియా రైల్వే టెన్నిస్ టోర్నమెంట్‌లో దేశ వ్యాప్తంగా పలువురు క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఉత్కంఠభరితంగా సాగిన డబుల్స్ ఫైనల్‌లో శ్రీనివాసరావు, మునీర్‌లపై రాజేంద్రప్రసాద్, సంపత్‌కుమార్‌లు విజయం సాధించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.